# "సరళ" ::

కథకుడు:
వఝ్ఝల రామనరసింహమ్

"మాష్టారూ!..."అందిసరళ, సగంలోఫిడేలు ఆపిస్సి, నావైపు దీనంగా చూస్తూ...

'ఏం సరళా...?...ఏం...ఫిడేలు ఆపిస్యేవ్?' అన్నాను నేను...

"అబ్బ! మాష్టారూ...మరి వాయించలేనండీ యివాళ"

"ఏమమ్మా? ఏమిటయింది చెప్పు..."

"ఏమీ లేదండీ మాస్టరుగారూ..." అంది ఏదోభాధను కనపరుస్తూ...

నేనామె మొగంలోకి చూశాను......

విశాలమైన ఆమె నేత్రాల్లో ఏదో తెలియని వ్యధ, విషాదము కనిపిస్తున్నాయి...

నా మనస్సు కలత చెందింది......

ఆవేళల్లా, సరళ ఎందుకో వింతగా కన్పించింది...

"సరళా!...ఇవాళ ఎందుకిలా వున్నావ్?" అన్నాను.

"...ఏం లేదండీ..." అంది సరళ.

"ఏమమ్మా!... చెప్పు..."

"ఏం లేదండి..."

"ఏమమ్మా...ఏదో దాస్తున్నావు..."

"అబ్బ! ఏమీ లేదండీ...ఏం దాచడం లేదు..."

"సరళా......"

"ఏమండి మాష్టారూ!"

"రోజురోజుకు నువ్వు మరింత చిన్నపిల్లవై పోతున్నావు!"

"పోనీండి, మంచిదేకదూ..." అని నావైపుచూసి నవ్వింది......

"పిచ్చి పిల్లా!"

సరళ గబగబా, ఫిడేలు పెట్లో పెట్టేస్తున్నాది...

గది ద్వారం దగ్గర చప్పుడయింది...

ఒక తలుపుతీసివున్న ద్వారంలోంచి, రామారావుగారు కళ్ళజోడు సర్దుకుంటూ, అతి ప్రయాసంతో రాబోతున్నారు...

"ఉండండి రామారావుగారూ...ఆ తలుపు కూడా తీస్తాను" అన్నాను నేను నవ్వాపుకొంటూ.

"అక్కర్లే...అఖర్లే...దు..."అని రామారావుగారు కష్టపడి, ఎలాగైతేనేం, మరో పదినిమిషాలకి ద్వారంలోంచి రాగలిగారు...

"ఏఁవమ్మా సరళా! ఇవాళ ఇంత వేగిరం మూయిశ్శావు ఫిడేలు?" అన్నారు రావుగారు కుర్చీలో కూచొంటూ...

"ఏం లేదండి నాన్నారూ" అంది సరళ, నావేపు క్రీగంటచూసి నవ్వుతూ!

ఆ వేళ లక్ష్మీవారం......

నాకెదురుగా, చాపమీద కూచుని, సరళ ఫిడేలు వాయిస్తున్నాది...

నేను సంగీతం పుస్తకం పట్టుకొని, ఆమధుర గానాన్ని వింటున్నాను...

పువ్వుల సిల్కుచీర, చేతికి బంగారు గాజులు మెళ్లో సన్నని బంగారు గొలుసు, ఎర్రటి పెదిమెల మీద తియ్యటి చిరునవ్వు, లేచెక్కిళ్లలో అరుణ కాంతి...వీటితో సరళ దేవకన్యకలా చాప మీద కూచుని ఫిడేలు వాయిస్తున్నాది...

ఫిడేలు తీగలలోంచి అమృతగానం వెలువడుతున్నాది...

నేను తన్మయత్వంతో వింటున్నాను...

ఒక్కమారుగా, గానామృతమాగిపోయింది.

సరళ నాకళ్లల్లోకి దీనంగాచూస్తూ ఫిడేలు కింద నుంచింది...

నేనాశ్చర్యపోయాను...!

"సర...ళా...!"

"మాష్టారూ...!!"

"ఏఁవమ్మా సరళా! ఆపిస్సేవు పాట?"

"అబ్బ!...మాస్టారూ...మరేం..."

"మ...రి...మేస్టరుగారూ...ఇవాళ కొత్త పాఠం చెప్పరండీ..."

"ఊఁ! ఎందుకు చెప్పను సరళా నీకు ?... మొదట ఆ "రఘువంశ సుధాంబుధి" అన్న పాట పాడుతూ వాయించవూ...వినాలనుంది..."

"తప్పకుండా వాయిస్తాను మాష్టరుగారూ-- మీకు సంతోషమైతే నేను వాయించకుండా వుండగలనా......"

సరళ ఫిడేల్ను తనహస్తాల్లోకి తీసికొంది—

ఫిడేలు అమృతస్వరాలని కురిపిస్తున్నాది...

ఆస్వరాల్లో కోకిల నినాదంవంటి సరళ కంఠం మధురంగా మేళవించింది...

నేనేదో స్వర్గసుఖాన్ని చూరగొంటూ, నిస్తబ్ధుడనై అలాగే వుండిపోయాను...

పాట పూర్తయింది...

కాని, నాహృదయంలో యింకా ఆ మధుర స్వరాలు ప్రతిధ్వనిస్తున్నాయ్!

"మాస్టారూ! పాట బావుందా!"

నా హృదయం మళ్ళీ ఈ ప్రకృతి లోకంలోకి ఒక గెంతువేసింది...

"ఊఁ! అత్యంత మధురంగావుంది సరళా, నీ పాట"......

"నిజంగానే, మాస్టారూ ?"

"నిజం సరళా...!"

సరళ నావైపు దీనంగా చూస్తూ అలాగేవుండిపోయింది......

ఆమెకళ్ళల్లో ఏదో దివ్యమైన కాంతిని నేను చూడగలిగాను...

ఆ కాంతిలోంచి రెండు భాష్పాలు క్రమంగా వచ్చి ఆమెచెక్కిళ్ళమీద నిల్చాయి.........

"సరళా...!" అన్నాను నేను...

"మాస్టారూ..."

"ఎందుకు సరళా అకన్నీళ్లు ? వెర్రి పిల్లా !"

"అబ్బ!...ఎందుకో నాకు దుఃఖంవస్తూంది మేష్టారూ..."

"దుఃఖం యెందుకు సరళా.... !"

"మాస్టారూ! ఒక్కటడుగుతాను" చెప్తారా?

"ఊఁ! ఏమిటది సరళా"

"నిజంగా చెప్తానంటే"

"నిజంగానే చెప్తాను..."

"అయితే...మాస్టారూ...నన్ను మీరు మరిచిపోకుండా వుంటారు కదూ...?" అని సరళ అంటూవుంటే, ఆమె కంఠం గద్గదికమై పోయింది ఆమె మరి మాట్లాడలేక పోయింది...

"దీనికా సరళా...ఇంతదుఃఖమూను...?"

"చెప్పండి మేష్టారూ మరి ?"

"నిన్ని జన్మలో మరిచిపోలేను సరళా" సరేనా ?

* *

సంగీతం పుస్తకం చేత్తోపట్టుకొని, చాపమీద కూచుని వున్నాను, సరళకోసం ఎదురు చూస్తూ...

ఆవేళ ఎందుకో నామనసు మనసులోలేదు.

హృదయాన్నంతా ఏదో భీతి ఆవరించుకు పోయివుంది...

మాటిమాటికీ తుళ్ళిపడి చూస్తున్నాను......

హృదయకుహరంలో విషాద దేవత నాట్యం చేస్తూన్నట్టయింది.........

సరళవచ్చి ఎదురుగానుంచుని వుంది!

ఆమెచేతుల్లో ఫిడేలు లేదు...

ఆమె వదనంలోకూడా ఏదో విషాదం కన్పించింది నాకు......

ఏదో విషాదవార్త నా చెవులని పడుతుందేమోనని భీతిచెందాను...

"స...ర...ళా...!"

"ఊఁ......"

"ఫిడేలు తేవలేదేం సరళా !"

"........"

"మాటాడవూ సరళా..."

"..........."

"స...ర...ళా...!"

"మాస్టారూ!" అంటూ పొంగిపొర్లే దుఃఖాన్ని ఆపుకోలేక, వెక్కి వెక్కి ఏడుస్తూ కూలిపోయింది....

'మాస్టారూ...ఇవా...ళ...నిం...చి...మరి మీకు నా...కు...మేష్టరుగారు...కాదు...''

"ఆ!...ఏమిటి సరళా!! ఏమిటన్నావూ?"

"మాస్టారూ...ఇవాళనుంచి, మనం...ఒకరికొకరు దూరమై పోతున్నాం......"

నాహృదయంలో పిడుగు పడ్డట్టయింది......

"ఆ! ఏం సరళా?"

"మా నాన్నగారు నా పెళ్ళి తలపెట్టారు... ఇంకా రెండు రోజులుంది...మాస్టారూ..."

"అహ్!...సరళా దుఃఖించకు..."

"ఎలా దుఃఖించవద్దంటారు మేష్టారండీ"

"హృదయం రాయిచేసుకో..."

"మరి మీకోమలహృదయమో!?"

"అదా? అదప్పుడే పాషాణమైపోయింది, సరళా...!"

* * *

భజంత్రీ, మేళాలు ఇల్లంతటా ప్రతిధ్వనిస్తున్నాయి...ఆవేళే సరళ వివాహం! పెళ్ళికి నన్ను కూడా ఆహ్వానించారు...నేనొక గదిలో ఫిడేలు పట్టుకొని కూచునివున్నాను...

పెళ్ళికొడుకు పెళ్ళికూతురు, పీటలమీద కూచున్నారు...

సరళ నావైపు ఒకమారు చూసింది...

నాగుండెల్లో శూలాలుదిగినట్లు అయింది...

ఈ ప్రపంచకమంతా అంధకారమయమైనట్లుగా వుందినాకు...

ఫిడేలుమీద ఏదో విషాదగీతిక వాయిస్తున్నాను.

ఇంతలో రామారావుగారు వచ్చి, "సరళమ్మా!...మీ యిద్దరు దంపతులూ వెళ్ళి సంగీతం మేష్టరుగారికి నమస్కారం చెయ్యండి...వారి పవిత్ర దీవన మీకు ముఖ్యం..." అన్నారు...

సరళ ముందు లేచింది...

పెళ్ళికొడుకుకూడా లేచాడు...

నాలో నేనే ఏదో గర్వించాను...

ఇద్దరు దంపతులు నావైపు వస్తున్నారు.

నేను లేచి నిలబడ్డాను...

నా చేతుల్లో ఫిడేలువుంది...!!!

ఇద్దరూవచ్చి, వంగి, నాపాదాలకి నమస్కరించారు...

నా మనసారా వారిని దీవించాను...

పెళ్ళికొడుకు లేచాడు...

కాని, సరళయింకా నాపాదాలను తాకుతూనే వుంది...పవిత్రజీవి!!

"ఇంకలే అమ్మా సరళా!" అన్నారు రామారావుగారు...

"పాపం! మాచిట్టి తల్లికి సంగీతం మేష్టరంటే చిన్నప్పటినించీ ఎంతో అభిమానం" అంది సరళ తల్లి...

ఫిడేలు తీగలలోంచి యింకా భయంకర విషాద స్వరాలు వెల్వడుతూనే వున్నాయి!

సరళ తలెత్తి కడసారి చూపు నావేపు చూచింది. అదే ఆఖరుచూపు.

